# 5వ అధ్యాయం

పునరావాస సహాయం ప్రణాళిక:

## 5.0 పునరావాస సహాయం కొరకు పథకాలు / ప్రణాళికలు:

ప్రభావిత జోన్‌ను ప్రకటించేందుకు, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల సర్వే, జనాభాలెక్కలను నిర్వహించేందుకు, పునరావాస సహాయం కోసం లభ్యంగా ఉన్న ప్రభుత్వ భూమి, సేకరించవలసిన భూమిని మదింపు చేసేందుకు, పునరావాస సహాయంకొరకు ముసాయిదా పథకం / ప్రణాళికను రూపొందించి, దాని తుది ప్రచురణకొరకు, ఈ అధ్యాయంలో పేర్కొన్న కార్యవిధానాన్ని పాటించవలసి ఉంటుంది.

ప్రభావిత జోను ప్రకటన:

5.1 ప్రాజెక్టుకోసం భూ సేకరణవలన కుటుంబాలు వారి భూములు లేదా గృహాలనుండి నిర్వాసితులయ్యే అవకాశం ఉన్నదని సంబంధిత ప్రభుత్వం భావించినట్లయితే, ఆయా గ్రామాల ప్రాంతం లేదా ప్రదేశాలను ప్రభావిత జోనుగా అధికారిక గెజిట్‌లో ప్రచురించ బడును. అప్పటినుండి ఈ విధానంలోని అంశాలు అట్టి ప్రాజెక్టుకు వర్తించును.

5.2 విధానంలోని 5.1 పేరా క్రింద చేసిన ప్రతి ప్రకటనను కనీసం రెండు దినసరి వార్తా పత్రికలలో ప్రచురించాలి. వాటిలో ఒకటి, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలు లేదా ప్రాంతాల్లో అమలులో ఉన్నట్టి స్థానిక మాతృభాషలో వుండాలి. అంతేకాకుండా, ప్రభావిత జోనులోని సంబంధిత గ్రామ పంచాయతీల నోటీసు బోర్డుపైన, ఇతర ప్రధాన ప్రదేశం లేదా ప్రదేశాలలో ప్రకటన ప్రతిని అతికించాలి.

5.3 ఈ విధానంలోని 5.1 పేరా క్రింద ఒకసారి ప్రకటన చేసినట్లయితే అడ్మినిస్ట్రేటర్, పునరావాస సహాయం ఈ ప్రాజెక్టు ప్రభావిత వ్యక్తులు, వారి కుటుంబాలను గుర్తించేందుకోసం సాంఘిక, ఆర్థిక సర్వేను చేపట్టాలి.

పిఎఎఫ్‌లు, పిడిఎఫ్‌లు మొదలగువాటి సర్వే, జనాభా లెక్కల కోసం అనుసరించ వలసిన కార్య విధానం:

5.4 ప్రతి సర్వే, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు చెందిన ఈ క్రింది గ్రామంవారీ సమాచారం కలిగివుండాలి:–

ఎ) ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలలో శాశ్వతంగా నివసిస్తున్నట్టి ఏదేని వర్తకం, వ్యాపారం, వృత్తిని చేస్తున్న కుటుంబ సభ్యులు.

బి) గృహాలు, వ్యవసాయభూమి, ఉపాధి లేదా వారి వర్తకం / వ్యాపారం లేదా వృత్తికి చెందిన ప్రధాన వనరులు పూర్తిగా లేదా గణనీయంగా అన్యాక్రాంతమయ్యే ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు.

సి) వ్యవసాయ కూలీలు మరియు వ్యవసాయేతర కూలీలు.

డి) 13-12-2005 నాటికి ముందునుండీ అటవీ భూములు స్వాధీనంలో ఉన్నట్టి ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు.[1]

ఇ) నిస్సహాయ వ్యక్తులు అనగా, జీవనోపాధి కల్పించబడని లేక వెంటనే కల్పించే వీలులేని వారైన వికలాంగులు, నిరుపేదలు, అనాధలు, విధవరాండ్రు, పెళ్ళికాని అమ్మాయిలు, భర్తచే వదలివేయబడిన స్త్రీలు లేక 50 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు మరియు ఏ కుటుంబంలోను సభ్యులు కానివారు. 1

ఎఫ్) భూమిలేని కుటుంబాలు (పెరటిభూమి, వ్యవసాయ భూమి లేక రెండూ లేనటువంటి) మరియు దారిద్ర్యరేఖకు దిగువనున్న మరియు ప్రభావిత జోను ప్రకటించిన తేదీకి ముందు మూడు సంవత్సరముల కాలానికి తక్కువగాకుండ ప్రభావిత జోనులో నిరంతరంగా నివసిస్తున్న కుటుంబాలు. 1

1. జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 134, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్) శాఖ, తేది. 13-11-2009 ద్వారా సవరణ.

5.5 5.4 పేరా క్రింద చేపట్టిన ప్రతి సర్వే, 5.1 పేరా క్రింద ప్రకటించిన తేదీనుండి కనీసం తొంబై రోజుల లోపల పూర్తిచేయాలి.

5.6 పైన పేర్కొన్నట్లుగా తొంబై రోజుల కాల పరిమితి ముగిసిన మీదట లేదా వీలైనంత త్వరగా, పునరావాస, సహాయం అడ్మినిస్ట్రేటర్, ప్రభావిత వ్యక్తులందరి నుండి ఆక్షేపణలు, సూచనలను కోరుతూ ఆయన నిర్వహించిన సర్వే వివరాల ముసాయిదాను సంబంధిత గ్రామ పంచాయతీలో ప్రచురించాలి.

5.7 సర్వే వివరాల ముసాయిదాను ప్రచురించిన తేదీ నుండి ముప్పై రోజులు ముగిసిన మీదట, ఇందుకు సంబంధించి ఆయనకు అందిన ఆక్షేపణలు, సూచనలను పరిశీలించిన మీదట, పునరావాస సహాయ అడ్మినిస్ట్రేటరు, తన సిఫార్సులతో కూడిన సర్వే తుది వివరాలను జిల్లా కలెక్టరుకు ఆమోదంకొరకు సమర్పించాలి. జిల్లా కలెక్టరు ఆమోదము తరువాత అవసరమైన విధులను తగిన పద్దునుండి సంబంధిత సాగునీటి ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరునుండి పొందవలెను.[1]

5.8 పునరావాస, సహాయ శాఖ అడ్మినిస్ట్రేటర్ సిఫార్సులు అందిన తేదీ నుండి నలబై అయిదు రోజుల లోపల, జిల్లా కలెక్టరు సర్వే తుది వివరాలను అధికారిక జిల్లా గెజిటులో ప్రచురించాలి. అట్టి ప్రచురణ ప్రతిని సంబంధిత గ్రామ పంచాయతీలో కూడా ప్రచురించాలి.[2]

5.9 పునరావాస, సహాయ అడ్మినిస్ట్రేటర్, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు సాధ్యమైనంతవరకు గ్రూపు లేదా గ్రూపులలో పునరావాసం పొందేటట్లు చూడాలి. అట్టి స్థలాలు సాధ్యమైనంత వరకు ప్రస్తుత గ్రామ పంచాయతీలో భాగంగా ఉండాలి. అయితే, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ప్రాధాన్యతా ప్రాతిపదికపై, పరస్పర అవగాహనతో తమ స్వంత గుర్తింపును, సంస్కృతిని కాపాడుకోవాడనికి ప్రతి గ్రూపు అభీష్టం మేరకు నిలకడగా ఆతిధ్య సమాజంలో పునరావాసం ఏర్పరచుకునే విధంగా చూడవలసి ఉంటుంది.

**పునరావాసానికి లభ్యంగా ఉన్న భూమి మదింపు:**

5.10 పైన పేర్కొన్న 5.9 పేరాలోని ప్రయోజనాలకోసం, పునరావాస సహాయం, అడ్మినిస్ట్రేటర్, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడంకోసం ప్రస్తుత గ్రామ పంచాయతీ లేదా పొరుగున ఉన్న గ్రామ పంచాయతీలో లభ్యంగా ఉన్న భూముల జాబితాను తయారు చేయాలి.

5.11 5.10 పేరా క్రింద జాబితాలో చేర్చిన భూములు ఈ క్రింది విధంగా ఉండాలి:–

ఎ) ప్రభుత్వ బంజరు భూములు లేదా ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసానికి లభ్యంగా ఉన్న ప్రభుత్వానికి చెందిన ఏదేని ఇతర భూమి.

బి) అక్కడ తగినంత ప్రభుత్వ భూమి లభ్యంగా లేనట్లయితే, అప్పుడు పునరావాస పథకం / ప్రణాళిక (ఆర్ ఆర్ సెంటర్) కోసం భూమిని సేకరించవలసి ఉంటుంది. అయితే, పునరావాస, సహాయ అడ్మినిస్ట్రేటర్, అట్టి భూసేకరణవలన మరో ప్రభావిత కుటుంబాల జాబితా తయారు కాకుండా చూడాలి.

---

1. జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 73, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టుల విభాగం– ఎల్ఎIV, ఆర్ అండ్ ఆర్–I) శాఖ, తేది. 03–02–2007 ద్వారా సవరణ.
2. జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 120, నీటిపారుదల ఆయుకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజక్టుల విభాగం – ఎల్ఎIV–ఆర్అండ్ఆర్–II) శాఖ తేది 26–06–2010 ద్వారా సవరణ.

**పునరావాస జోను ప్రకటన:**

5.12 జిల్లా కలెక్టరు, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసానికి సేకరించిన లేదా సేకరించాలని ప్రతిపాదించిన ఏదేని ప్రాంతాన్ని ప్రకటన ద్వారా పునరావాస జోనుగా ప్రకటించాలి. [1]

**ఆర్ అండ్ ఆర్ కోసం భూ సేకరణకు అధికారం:**

5.13 పునరావాస, సహాయ అడ్మినిస్ట్రేటర్ లేదా ప్రభుత్వం అధికారం ఇచ్చిన ఎవరేని ఇతర అధికారి, సంబంధిత ప్రభుత్వం తరఫున, భూసేకరణ చట్టం, 1894లోని నిబంధనల క్రింద ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాస సహాయానికి అవసరమైన భూములను తప్పనిసరిగా సేకరించనగును.

**ఆర్ అండ్ ఆర్ కోసం ముసాయిదా పథకం/ప్రణాళిక:**

5.14 ప్రాథమిక సర్వే, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల గణాంకాలు, పునరావాస సహాయానికి అవసరమైన భూమి మదింపు పూర్తయిన మీదట, పునరావాస సహాయ అడ్మినిస్ట్రేటర్, మహిళలు, ప్రాజెక్టు ప్రాంతం పరిధిలోపల ఉన్న పంచాయతీరాజ్ సంస్థలలో ఎన్నికైన అధ్యక్షులతో సహా ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల ప్రతినిధులతో సంప్రదించి వారి పునరావాస సహాయానికి ముసాయిదా పథకం / ప్రణాళిక రూపొందించాలి.

ఎ) ముసాయిదా పునరావాస, సహాయ పథకం గురించి గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ సభలతో చర్చించాలి. పట్టణ ప్రాంతాల్లోను, గ్రామ సభలులేని గ్రామీణ ప్రాంతాల్లోను బహిరంగ చర్చ జరపాలి. [2]

బి) భారత రాజ్యాంగం, 5వ షెడ్యూలులోని షెడ్యూల్డు ప్రాంతాల్లో గ్రామసభలలోను లేక సంబంధిత స్థాయి పంచాయితీల్లోను చర్చ, పంచాయితీల (షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరణ) చట్టం, 1996 (1996 సంవత్సరపు 40వ చట్టం)లోని నిబంధనలననుసరించి జరగాలి. [2]

సి) షెడ్యూల్డు ప్రాంతాల్లో, 200 లేక అంతకుమించి గిరిజన కుటుంబాలు వారి భూములు మరియు గృహాలనుండి తప్పనిసరిగా నిర్వాసితులవుతున్నట్లయితే, సంబంధిత గిరిజన సలహా మండలితోను చర్చించాలి. [1]

5.15 ముసాయిదా పథకం / ప్రణాళికను రూపొందిస్తున్నపుడు పునరావాస, సహాయ అడ్మినిస్ట్రేటర్, ఆర్ అండ్ ఆర్ పథకం / ప్రణాళిక వ్యయం, భూమిని సేకరిస్తున్నట్టి ప్రాజెక్టు వ్యయంలో సమగ్ర భాగంగా ఉండేటట్లు చూడాలి. ఆర్ అండ్ ఆర్ ప్రయోజనాలకు సంబంధించిన పూర్తి వ్యయం, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాస, సహాయానికి సంబంధించిన ఇతర వ్యయాలను, సంబంధించిన సంస్థ భరించవలసి ఉంటుంది.

5.16 ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాస, సహాయ పథకం / ప్రణాళిక సక్రమంగా అమలు చేయడానికి పునరావాస సహాయ అడ్మినిస్ట్రేటర్‌కు తగినన్ని నిధులను సమకూర్చడానికి సంబంధిత సంస్థ బాధ్యత వహించాలి.

5.17 పునరావాస సహాయ అడ్మినిస్ట్రేటర్ తనకు సమకూర్చిన నిధులకు సంబంధించిన అకౌంట్ల పుస్తకాలను, రికార్డులను నిర్వహిస్తూ, ఈ విషయంలో సంబంధిత ప్రభుత్వానికి నియమితకాలిక రిటర్నులను సమర్పించాలి.

---

1. జి.ఓ.ఎమ్.ఎస్. నెం.88, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్) శాఖ, తేది.26-08-2010 ద్వారా సవరణ.
2. జి.ఓ.ఎమ్.ఎస్.నెం.134, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్) శాఖ, తేది.13-11-2009 ద్వారా సవరణ.

**ఆర్ అండ్ ఆర్ ముసాయిదా పథకం/ ప్రణాళిక అంశాలు:**

5.18 పునరావాస సహాయానికి రూపొందించిన ప్రతి ముసాయిదా పథకం/ ప్రణాళిక ఈ క్రింద పేర్కొన్న వివరాలను కలిగివుండాలి.

ఎ) ప్రాజెక్టు కోసం సేకరించే భూమి విస్తీర్ణం, సంబంధిత గ్రామం (గ్రామాల) పేర్లు.

బి) గ్రామంవారీ ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల జాబితా, కుటుంబాల వారీగా నిర్వాసితులయ్యే వ్యక్తుల సంఖ్య, ప్రాజెక్టుకోసం భూసేకరణ ముందు, తరువాత, వారి స్వాధీనంలోవున్న భూమి విస్తీర్ణం, స్వభావం, సర్వే నెంబర్లను సూచిస్తూ, ప్రభావిత జోనులోని వారి స్థిరాస్తుల వివరాలు.

సి) అట్టి ప్రాంతంలో వ్యవసాయ కూలీల, వ్యవసాయ కార్యకలాపాలపై జీవనోపాధి ఆధారపడి ఉన్నట్టి వ్యక్తుల జాబితా.

డి) ప్రాజెక్టు నిమిత్తం భూసేకరణ పర్యవసానంగా ఉపాధిని లేదా జీవనోపాధిని కోల్పోయిన లేదా కోల్పోయే వ్యక్తుల లేదా తమ భూములను, ఉపాధిని, జీవనోపాధిని, వృత్తికి సంబంధించిన ప్రధాన వనరులను పూర్తిగా లేక గణనీయంగా కోల్పోయిన వ్యక్తుల జాబితా.

ఇ) స్వాధీనదారులు ఎవరైనా ఉన్నట్లయితే వారి జాబితా.

ఎఫ్) నష్టానికి గురికాగల ప్రజా వినియోగాలు, ప్రభుత్వ భవనాల జాబితా.

జి) ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు సమకూర్చదగునట్టి ప్రయోజనాలు, ప్యాకేజీల సమగ్ర జాబితా.

హెచ్)ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సమకూర్చదగునట్టి లభ్యంగావున్న భూమి విస్తీర్ణం వివరాలు.

ఐ) ప్రాజెక్టు కోసం సేకరించిన భూమికి బదులుగా ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు కేటాయించడానికి లభ్యంగా గల ప్రభుత్వ భూమి విస్తీర్ణం వివరాలు.

జె) ప్రాజెక్టు కోసం సేకరించిన భూమికి బదులుగా ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు కేటాయించడానికి, సేకరించదగునట్టి ప్రాజెక్టు వల్ల ప్రయోజనం పొందే ప్రాంతాలలో లభ్యంగా ఉన్న పట్టా భూమి విస్తీర్ణం వివరాలు.

కె) పునరావాసానికి సమకూర్చవలసివున్నట్టి ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక సదుపాయాల వివరాలు.

ఎల్) నిర్వాసిత కుటుంబాలను పునరావాస జోనులలోకి తరలించడానికి, పునరావాసం కల్పించడానికి కాల పరిమితి.

ఎం) పునరావాస సహాయ అడ్మినిస్ట్రేటర్, జాబితాలో చేర్చడానికి యోగ్యమైనవిగా భావించదగిన ఇతర వివరాలు.

ఎన్) జి.ఓ.ఎం.ఎస్.నెంబర్లు 46 మరియు 77, నీటిపారుదల, ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (పి.డబ్ల్యు. ఎల్.ఎ.×ఒ-ఆర్ అండ్ ఆర్) శాఖ, తేదీలు 28-02-2009 మరియు 10-07-2009లలో నిర్వచించబడిన నిస్సహాయ బాధిత వ్యక్తుల జాబితా. [1]

ఓ) ఏదేని ప్రాజెక్టుకోసం జరిపే భూసేకరణవలన 200 లేక అంతకుమించి గిరిజన కుటుంబాలు తప్పనిసరిగ నిర్వాసితులవుతున్నట్లయితే, నిర్ణయించిన రీతిలో గిరిజన అభివృద్ధి ప్రణాళిక తయారు చేయవలెను. అట్టి ప్రణాళికలో ప్రత్యేకమైన సత్వర చర్యల ద్వారా భూములపై గిరిజనులకుగల స్థిరీకరించని హక్కులను స్థిరీకరిస్తూ అన్యాక్రాంతమైన భూములపై హక్కును గిరిజనులకు కల్పించడానికి సవివరమైన పద్ధతిని వివరించాలి. అంతేగాక, అడవితో సంబంధాలు కోల్పోయిన గిరిజనుల అవసరాలకు సరిపడే ప్రత్యామ్నాయ వంట చెరకు, పశుగ్రాసం మరియు చిన్నతరహా అటవీ ఉత్పత్తులను 5 సంవత్సరాల లోపల అడవులు లేని భూముల్లో అభివృద్ధిపరచే పథకం కూడ పై ప్రణాళిక కలిగివుండాలి. [1]

పి) స్వయం ఉపాధికొరకు అవసరమైన వాణిజ్య, సాంకేతిక మరియు వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధికోసం ప్రతిపాదించిన శిక్షణా కార్యక్రమాల వివరాలు. [1]

5.19 పునరావాస, సహాయ అడ్మినిస్ట్రేటర్, పునరావాస సహాయానికి సంబంధించిన ముసాయిదా పథకం / ప్రణాళికను ఆమోదంకోసం జిల్లా కలెక్టరుకు సమర్పించాలి. ముసాయిదా పథకం/ ప్రణాళికను సంబంధిత గ్రామం / ప్రాంతంలో ప్రచురించాలి. ప్రభావిత జోనులో సదరు ముసాయిదా పథకం / ప్రణాళికకు విస్తృత ప్రచారం కల్పించడానికి జిల్లా గెజిటులో కూడా ప్రచురించాలి. [2]

**ఆర్ అండ్ ఆర్ పథకం/ ప్రణాళిక తుది ప్రచురణ:**

5.20 అట్టి పథకం / ప్రణాళికను ప్రకటించిన మీదట, ఆ పథకం / ప్రణాళిక అమలులోనికి వస్తుంది.

1. జి.ఓ.ఎమ్.ఎస్. నెం.134, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్) శాఖ, తేది.13-11-2009 ద్వారా సవరణ.
2. జి.ఓ.ఎమ్.ఎస్. నెం.120, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్-II) శాఖ, తేది.26-06-2006 ద్వారా సవరణ.